

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు
## నెల్లూరు

20 డిసెంబర్ 2025 పేజీలు : 08 శనివారం




# అంతులేని అవినీతి శాఖ

పార్ట్ 2

# "ఎక్సైజ్ శాఖ"

- పీ4 మాటున మద్యం దుకాణాల నుంచి అంతులేని దోపిడీ
- రహస్య విచారణ చేపడితే.. అయ్యగారి దోపిడీ 70 ఎంఎంలో కనిపిస్తుందట

కావలి, మేజర్‌న్యూస్ :

కావలి నియోజకవర్గంలో ఎక్సైజ్ ఒక అధికారి వైన్ షాపులు, బార్లు యజమానుల ద్వారా బెల్ట్ వ్యాపారాలు చేయిస్తూ అందిన కాడికి అడ్డంగా దోచుకుంటున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దాతల ద్వారా పేదలను ఆదుకునే మంచి పథకాన్ని ఇందుకోసం ఉపయోగించుకుంటుండగా.. ఆ అధికారికి అదే వరంగా మారినట్లు కనిపిస్తోంది. సదరు అధికారి బెల్టు షాపులను ప్రోత్సహించి నెలకు లక్షల్లో వైన్స్‌షాపుల వారి దగ్గర మామూళ్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇదేమిటని ప్రశ్నించిన వారిని.. పైఅధికారులకూ ఇందులో లింకులు ఉన్నాయని.. వారికీ మామూళ్లు అందజేస్తున్నాం.. మమ్మల్ని మీరేమి చేయలేరు.. ఏమైనా చేసుకోండి.. అంటూ ఒక అధికారి చిందులేస్తున్న పరిస్థితి వింతగొల్పుతోంది. కావలి పట్టణంలోని ఈ అధికారి.. కొంతమంది వైన్ షాపు యజమానులతో జతకట్టి వారి వైన్ షాపులకి మాత్రమే ప్రతిరోజు బెల్ట్ షాపులు వ్యాపారం చేసుకోవడానికి లైసెన్స్ ఇవ్వడం, వారి దగ్గర నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేసుకోవడం, అంతేకాకుండా మిగతా వైన్స్ వారు బెల్టుషాపులుంటే వారి మీద కక్ష గట్టి వారిని అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఈ అధికారి ప్రభుత్వ పథకం పీ4 అనే పథకానికి తానేదో డబ్బులు ఇచ్చి పేదవారికి తోపుడు బండ్లను సహాయం చేసినట్లు కావలి ఎమ్మెల్యే కావ్య దగ్గర పేపర్లో ఫోటోలకు ఫోజులు ఇవ్వడం మనం చూశాం. ఇతను వైన్‌షాపుల వద్ద సుమారు పది వేల దాకా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. ఈ డబ్బులు వేలలో, లక్షల్లో వసూలు చేసి కొంత మాత్రమే ఖర్చు చేసి ఈ తోపుడుబండ్లను కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ద్వారా ఏదో పీ4 కింద సహాయం చేస్తున్నట్లు వారికి తప్పుడు సమాచారాన్ని ఇవ్వడం కూడా చూశాం. కావలిలో రోజురోజుకీ ఈ అధికారి ఆగడాలు మితి మీరిపోతున్నాయి. వీరిపై ఉన్నత అధికారులు సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు, -మిగతా 2లో



భార్య హత్య కేసులో.. 02

# భర్తకు జీవిత ఖైదు



కట్టుకున్న భార్యపై అనుమానంతో ఆమెను గుంజకు కట్టివేసి తగులు పెట్టి హత్య చేసినట్లు నమోదైన కేసులో నిందితుడు భర్త పులి మునిస్వామిపై ఆరోపణలు సాక్షాధారాలతో రుజువైనందున అతనికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జ్ ఎంఏ సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు.

కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచేందుకు

# కృషి చేయండి

ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్



వివరాలు 8లో

ఈహెచ్‌ఆర్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే..

# శాఖాపరమైన చర్యలు తప్పవు

డీఎంఅండ్‌హెచ్‌ఓ డా॥ వి.సుజాత

నెల్లూరు, మేజర్‌న్యూస్ :



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (ఈహెచ్‌ఆర్) నిర్వహించాల్సిన బాధ్యత ఆయా సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డి కంప్యూటర్‌లదేనని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ వి.సుజాత తెలిపారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (ఈహెచ్‌ఆర్) నిర్వహించటంపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, వీటి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, -మిగతా 2లో






జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి

# ఆచరణీయం



నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :

క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని, మానవ జీవితంలో ప్రతిఒక్కరూ ఐక్యత, ప్రేమ, దయతో నిజాయితీగా జీవించడమే క్రీస్తు బోధనల సారాంశమని కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు- హైటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ -మిగతా 2లో

# మున్సిపల్ కార్మికులపై దౌర్జన్యం ఖండిస్తున్నాం




మహిళా జోనల్ అధ్యక్షురాలు మెయిళ్ళగౌరీ

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కార్మికులు వాళ్లకి రావలసిన హక్కుల కోసం 40 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తుంటే.. ఈ ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టయినా స్పందన లేదని వైఎస్ఆర్‌సీపీ మహిళా జోనల్ అధ్యక్షురాలు మెయిళ్ళ గౌరీ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు ఆడవారిని కూడా చూడకుండా, మహిళా పోలీసులు లేకుండా ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి వాహనాల్లో ఎక్కించడం దారుణమన్నారు. ఈ రాష్ట్రంలో మహిళలకు హక్కులే లేవన్నట్లు పోలీసులు వ్యవహరించడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎక్కడ చూసినా మహిళలలు, చిన్నారులపై దౌర్జన్యాలు, లైంగిక వేధింపులు చేస్తుంటే పోలీసులు చేతకానితనంగా వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సేవలు గుర్తించకపోయిన పర్లేదు కానీ, ఆ గౌరవపరచటం అన్యాయమన్నారు. ఈ విషయాన్ని మహిళా కమీషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలిగిన వైఎస్ఆర్పిపి మహిళా విభాగం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, జిల్లా వైసీపీ అంగన్వాడి వింగ్ అధ్యక్షురాలు లావణ్య పాల్గొన్నారు.

# క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రేమ, కరుణ, త్యాగం, మానవ సేవకు ప్రతీక అని అన్నారు. యేసు క్రీస్తు బోధించిన శాంతి, సోదరభావం, సేవా భావం సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడుతాయని తెలిపారు. అన్ని మతాలు, వర్గాల మధ్య పరస్పర గౌరవం నెలకొనాలనే ఉద్దేశంతో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు.రాబోయే క్రిస్మస్ పండుగ జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సహోదర లాలనం, సమాధాన పాలనం యేసుక్రీస్తు జననం ప్రధాన లక్ష్యాలులిబిషప్ మోస్ట్ రెవ. పిల్లి ఆంథోని దాస్ మాట్లాడుతూ మహోన్నతుడు, మహనీయుడు ఒక మానవుడిగా జన్మించిన పర్వదినం క్రిస్మస్ అని, ప్రభువు యేసు గొప్పతనాన్ని వివరించారు. సహోదర లాలనం, సమాధాన పాలనం బాల యేసు జననం ముఖ్య లక్ష్యాలని తెలిపారు. ఇతరులకు ఆనందాన్ని కలిగిస్తూ పరోపకారం చేయడం క్రీస్తుపై ఉన్న విశ్వాసం, నమ్మకానికి నిదర్శమని చెప్పారు. మనమంతా మతసామరస్యం, మత స్వేచ్ఛ కలిగి ఒకే కుటుంబంగా కలిసిమెలిసి జీవించాలన్నది క్రీస్తు బోధనల సారాంశం అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై, ప్రభుత్వంపై యేసు ప్రభువు దీవెనలు ఉండాలని, నిధులు, వనరులు సమకూరి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ప్రభువును ప్రార్థించారు. తొలుత క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించి కలెక్టర్, పాస్టర్లు ప్రీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. అనంతరం క్రీస్తు జననం, ప్రాముఖ్యతపై ఆలపించిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. తదుపరి పలువురు పాస్టర్లు క్రీస్తు జనన విశేషాలను, క్రీస్తు బోధనలను తమ ప్రసంగాల్లో వివరించారు. కేక్ కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వొత్తులు వెలిగించి క్రిస్మస్ సందేశాన్ని చాటి చెప్పారు. అనంతరం అతిథుల చేతులు మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్ల విజ్ఞప్తి మేరకు నెల్లూరు నగరంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు నిర్మాణం, స్మశాన వాటికల అభివృద్ధి, పాస్టర్ల గౌరవ వేతనం మంజూరు మొదలైన కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఇప్పటి నుంచే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ రఘు, వివిధ సంఘాల పాస్టర్లు దయాసాగర్, ఎలీషాకుమార్, సురేంద్రబాబు, శోభన్ బాబు, బర్నబాస్, ఉదయ్ కుమార్, స్టీఫెన్, డేనియల్, హనోక్ తదితరులు పాల్గొన్నారు.












ఈహెచ్‌ఆర్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే..

# శాఖాపరమైన చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌డి. కంప్యూటర్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. జిల్లాలో పని చేస్తున్న ప్రతి ఒక్క వైద్య ఆరోగ్య సిబ్బంది తమకు కేటాయించిన సమయం ప్రకారం ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్) వేయాలని, ఎఫ్ఆర్ఎస్ వేయుటలో నిర్లక్ష్యం వహించు వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక నుంచి పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి ఎటువంటి సంచారం, సమస్య అయిన ఈ- ఆఫీసు ద్వారానే జిల్లా కార్యాలయానికి రావాలన్నారు. మెయిల్స్ ఉపయిగించరాదని, ఈ-ఆఫీసుకు చేరిన సమాచారం, సమస్యలను 24 గంటలలో పరిష్కరించాలన్నారు. ఫార్మాసిలో ఉన్న మందుల యొక్క ఎక్స్‌పెయిరీ తేదీలను 4 నెలల ముందుగానే గుర్తించి, త్వరగా ఎక్స్‌పెయిరీ అయ్యే మందులను పంపిణీ చేసుకోవాలని తెలియజేశారు. స్క్రబ్ టైఫస్ గురుంచి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనికి సంపూర్ణ చికిత్స వుందని, అవసరమైన మందులు అన్నీ పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉన్నాయని తెలియజేశారు. ముఖ్యంగా నివారణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని, శరీరం పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించుట, గుబురుగా ఉన్న పొదల్లోకి వెళ్లకుండా ఉండుట, మట్టిలోకి వెళ్ళేటప్పుడు రబ్బరు బూట్లు ధరించుట, దోమ తెరలు వాడుట, శరీరంపై నల్లటి మచ్చ ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించుట, జ్వరము, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు వంటి లక్షణాలు, రెండు మూడు రోజులకు మించి ఉంటే వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం నెల్లూరు జిజిహెచ్‌లో సంప్రదించి చికిత్స పొందవలేనని తెలియజేశారు.

# భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** కట్టుకున్న భార్యపై అనుమానంతో ఆమెను గుంజకు కట్టివేసి తగులు పెట్టి హత్య చేసినట్లు నమోదైన కేసులో నిందితుడు భర్త పులి మునిస్వామిపై ఆరోపణలు సాక్షాధారాలతో రుజువైనందున అతనికి 20 సంవత్సరముల జైలు శిక్ష, 2 వేల రూపాయలు జరిమాన విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జ్ ఎంఏ సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. సూళ్లూరుపేట మండలం జంగాలగుంటకు చెందిన నిందితుడు పులి మునుస్వామి, అతని భార్య మౌనిక వివాహం చేసుకొని ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చారు. తరువాత నిందితుడు మునుస్వామి మద్యం అలవాటుకు బానిసై, నిత్యం కట్టుకున్న భార్యను అనుమానంతో వేధించేవాడు. వీరితోటి హతురాలు తల్లి శ్రీనివాసులమ్మ కూడా ఉండేది. ఆమె అల్లుడు మునస్వామికి సర్దుబాటు చేసుకోవాలని, మద్యం తాగకుండా ఉండాలని చెప్తూ ఉండేది. ఈ నేపథ్యంలో 2017 ఫిబ్రవరి 28న రాత్రి 10 గంటల సమయంలో నిందితుడు మునుస్వామి అధిక మద్యం మత్తులో భార్య మౌనికను అనుమానంతో వేధించి కొట్టి ఆమెను ఇంటి వద్దనున్న ఒక గుంజుకు కట్టివేసి, కిరోసిన్ పోసి నిప్పు పెట్టాడు. దీంతో మంటల్లో చిక్కుకున్న భార్య మౌనిక బాధకు తాళలేక గట్టిగా కేకలు వేసింది. దీంతో ఇరుగు పొరుగు వారు వచ్చి సహాయం చేసి మౌనికను సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మార్చి 3, 2017న మరణించింది. ఈ సంఘటనపై హతురాలు మౌనిక తల్లి శ్రీనివాసులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూళ్లూరుపేట పోలీసులు నిందితుడు మునిస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి పైతీర్పు చెప్పారు. కేసును అప్పటి సూళ్లూరుపేట సీఐ విజయకృష్ణ దర్యాప్తు చేశారు. కోర్టు లైజన్ ఆఫీసర్‌గా హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పిపి షేక్ రఫీ మాలిక్ వాదించారు.

అంతులేని అవినీతి శాఖ..

# కావలి ఎక్సైజ్ శాఖ

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది వైన్స్ యజమానులు కూడా కోరుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవినీతి రహిత పాలన అందించాలని చూస్తుంటే.. ఇలాంటి అధికారుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కాబట్టి ఉన్నతాధికారులు, సీబీఐ, విజిలెన్స్ అధికారులు స్పందించి ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి, అసలు ఈ కావలి డివిజన్లో ఎక్సైజ్ అండ్ ప్రొవిషన్ శాఖకు ఎక్కడెక్కడ అయితే వైన్ షాపులు, బార్లుకు పర్మిషన్ ఇచ్చారో.. అక్కడ ఏమి అవినీతి జరుగుతుందో.. పూర్తిగా విచారణ చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఉపాధి హామీ ముద్దు.. విజీ రామ్ వద్దు

## 22న వద్ద ధర్నా : సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్, మిషన్ అజీవిక గ్రామీణ్ అనే కొత్త బిల్లును తెచ్చి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు అన్యాయం చేస్తూ, రాష్టాలపై భారం పడేవిదంగా చర్యలకు పూనుకోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకొని ఉపాధి కూలీలకు న్యాయం జరిగేలా చూడాలనిడిమాండ్ చేస్తూ స్థానిక సంతపేటలోనే సిపిఐ జిల్లా కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ఆంధ్రప్రదేశ్ జిల్లా కార్యదర్శి నంది పోగు రమణయ్య లు మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంపై తీవ్రమైన దాడి మొదలైంది. పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీని ఎలా నిర్వీర్యం చేయాలో మోడీ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. యూపీఏ ప్రభుత్వంలో తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు చేసి, వి బి-జి-రామ్ జి అనే కొత్త బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. ఈ కొత్త బిల్లు వలన ఉపాధి హామీ కూలీలకు ఒరిగేది ఏమి ఉండదు. వేతనాలు పెరుగుదల, పని దినాల పెంపు సవ్యంగా లేకపోవడం, సగటు వేతనం 240 రూపాయలకి తగ్గించడం జరిగింది. ఉపాధి హామీ కూలీలపై కేంద్ర ప్రభుత్వం సీత కన్ను వేసింది. చట్టం పదం వాడకుండా పథకం అనే పదం వాడడానికి ప్రయత్నం చేస్తున్నది. అందువల్ల రాను రాను పని అనే గ్యారెంటీ అనేది తీసివేస్తారేమో అని అనుమానం కూడా ఉంది.రాష్ట్రాల మీద భారం మోపే విధంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత యూపీఏ ప్రభుత్వంలో చట్టం తెచ్చినప్పుడు కేంద్రం 90 శాతం నిధులు, రాష్ట్రాలు 10శాతం నిధులు ఉపాధి హామీకి కేటాయించాలని నిర్ణయిస్తే, ప్రస్తుతం మోడీ ప్రభుత్వం రాష్ట్రాల మీద భారం పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. వేతనాలు కూడా ఇంతకు మునుపు వస్తున్న 260 రూపాయలు సగటు వేతనం కాకుండా, 240 రూపాయలు సగటున వచ్చే విధంగా కేంద్రం కుట్రలు పన్నుతున్నది. అయితే చట్టాన్ని ప్రజల ముందు బయట పెట్టకుండా, ప్రజలు, మేధావులు, పౌర సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోకుండా ఆమోదం పొందింది. గత యూపీఏ ప్రభుత్వం చట్టం తెచ్చే ముందు దేశంలో అందరి అభిప్రాయాలు తీసుకున్నది. నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదల పట్ల నియంతృత్వ ధోరణి కనపరిచారు.ఆ విధమైన అభిప్రాయాలు కేంద్ర ప్రభుత్వం తీసుకునే పనిలో లేనట్లు కనపడుతున్నది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేస్తున్న మోసాన్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గట్టిగా అడగాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు మా దగ్గర డబ్బులు లేవని బీద అరుపులు అరుస్తున్నప్పుడు, కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఎలా భరిస్తారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో ఉపాధి హామీకి బడ్జెట్ 10వేల కోట్లు అవసరం ఉంటుంది. మరి అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వం వేస్తున్న భారాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఆమోదయోగ్యము కాదు. కూటమి ప్రభుత్వం కూడా ఎన్డీఏలో భాగస్వామి కాబట్టి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసపూరితమైన కుట్రలను వ్యతిరేకించాలి. అడగకపోతే రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుంద న్నారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, ఉపాధి కూలీలకు నష్టం కలిగించే కొత్త చట్టం ఉపసంహరించాలని, రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వ కుట్రలను, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ షాన్వాజ్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లీలా మోహన్, ప్రజానాట్యమల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుది విజయ్ కుమార్, తల్లు శీనయ్య, ఎస్కే బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు విశిష్ట గుర్తింపు






## ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనమే జయ మహా పాత్ర

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** విద్యుత్ ఉత్పత్తి రంగంలో స్వతంత్ర సంస్థగా రాణిస్తున్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు విశిష్టమైన గుర్తింపు రెండోసారి కూడా వచ్చినట్లు ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనమే జయ మహా పాత్ర అన్నారు. శుక్రవారం ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విశిష్ట గుర్తింపు అంశం పైన పూర్తి వివరాలను మీడియాకు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధిగాంచిన గ్రేట్ ప్లేస్ టు వర్క్ అనే సంస్థ. సర్వే చేయగా ఉద్యోగస్తులు పూర్తిస్థాయిలో సంతృప్తిగా పనిచేస్తున్నట్లు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టుకు గ్రేట్ ప్లేస్ టు వర్క్ అండ్ సర్టిఫైడ్ వచ్చినట్లు సీఈఓ అన్నారు. 86శాతం మంది ఆమోదయోగ్యమైన తెలియజేయగా సర్వేలో ప్రాజెక్టుకు గుర్తింపు వచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగస్తులకు వేతనాలు, యాజమాన్యం ఉద్యోగస్తుల పట్ల ప్రవర్తిస్తున్న తీరు సక్రమంగా ఉండడం, మంచి వాతావరణంలో పనిచేయడం, క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న ప్రాజెక్టు లాంటి అంశాలతో రెండవ దఫా విశిష్ట గుర్తింపు చేకూరినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గతంలోఇదే అంశం పైన ఈ ప్రాజెక్టుకు విశిష్ట గుర్తింపు లభించి ఉంది. 2025 -26 సంవత్సరంలో రెండోసారి అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రేట్ ప్లేస్ టు వర్క్ అండ్ సర్టిఫికేషన్ పొందినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంత యువతకు వృత్తిపరమైన నైపుణ్యాలను అందించి వారిని ఆర్థికంగా నిలబెట్టడమే లక్ష్యమని స్వర్ణా టోల్‌వే జీఎం హరి పాండు రంగ స్వామి పేర్కొన్నారు. స్థానిక బీవీ నగర్‌లోని పిపల్ ట్రీ ఫౌండేషన్ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన 'మల్టీ స్కిల్ టెక్నీషియన్' శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన హరి పండు రంగ స్వామి, పిపల్ ట్రీ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్, ప్రాజెక్ట్ హెడ్ ఎస్.సురేష్ రెడ్డి, సెంటర్ హెడ్ క్రాంతి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. స్వర్ణా టోల్‌వే, పిపల్ ట్రీ ఫౌండేషన్ సంయుక్తంగా నిరుద్యోగ యువత కోసం ఈ శిక్షణా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి ఉద్యోగ అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు.

# వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : సామాజికవేత్త



**కావలి, మేజర్‌న్యూస్ :** సమాజంలో కష్ట పడి జీవించి సంపదను సృష్టించి వయో వృద్ధుల సంరక్షణ చట్టమును పటిష్టంగా అమలుచేసి వారి మీ గౌరవంగా చూడా లని సామాజిక కార్యకర్త ఎం.మాల కొండరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని 2007వ సంవత్సరంలో అమలు లోకి రావడం జరిగిందని, జన్మనిచ్చిన తల్లిదండ్రులను సమాజంలో వృద్ధాశ్రమాలకు పరిమితం చేయకుండా ప్రేమతో గౌరవంగా జీవించడానికి సహాయ సహకారాలు అందించి కుటుంబ వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి యువతీ, యువ కులకు ఉందని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ వారి హక్కులకు భంగం కలిగితే వెంటనే జిల్లా కలెక్టర్ లేదా రెవిన్యూ డివిజనల్ అధికారి అలాగే లోకదాలత్ న్యాయమూర్తులను కలిసి వారికి ఉన్న హక్కులను కాపాడు కోవడానికి ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సమాజం లో వయోవృద్ధుల అపారమైన సమాజ జ్ఞానాన్ని వారి మేధస్సును నేటి యువతరానికి అందజేసి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి వారి జ్ఞానం ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ వయోవృద్ధుల సంరక్షణ చట్టమును అవగాహన చేసుకుని పెద్దలను సంరక్షించుకోవడం గౌరవించడం ఎంతగానో ముఖ్యమని తెలిపారు.

# మర్రిపాడులో అమరవీరులకు నివాళులు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని మర్రిపాడు సెంటర్లో భారతదేశ స్వతంత్ర పోరాటంలో స్వాతంత్రం సాధించడం కోసం బ్రిటిష్ వారి చేతిలో అతి తక్కువ వయస్సులో ఉరి తీయబడ్డ రాంప్రసాద్ బిస్మిల్లా అసహు కుల్లా ఖాన్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అనంతరం వారు చేసినటువంటి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ మండల అధ్యక్షులు సయ్యద్ ఖాదర్ మస్తాన్, ప్రధాన కార్యదర్శి ఎస్కే కాలేషా, మహమ్మద్, సిపిఎం ప్రధాన కార్యదర్శి సయ్యద్ రహమతుల్లా, ఎస్కే ఖాజావలి, అజ్గర్ అలీ, గౌస్ బాష, సుధాకర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మహాసభలను విజయవంతం చేయండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఈనెల 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయ వంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, పేర్కొన్నారు. శుక్రవారం బిజింపల్లిలో కరపత్రాలు పంపిణి చేసిఆటో డ్రవర్ లను సభలకు ఆర్థిక సహాయం అభ్యర్ధించారు. ఐక్య పోరాటం అనే నినాదంతో దేశంలోని అన్ని సమరశీల పోరాటాల్లో సీఐటీయూ అగ్ర భాగాన ఉందన్నారు. 11 ఏళ్ల నుంచి కేంద్రంలో ఉండే బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేయడం దారుణమన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను అమల్లోకి తెచ్చి తీరని అన్యాయం చేసిందన్నారు. దేశంలోని కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకొచ్చి హక్కుల కోసం పోరాడేందుకు. సహాసభలకు సిద్ధమైందన్నారు. ఈ మహాసభలకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోసీఐటీయూ నాయకులు, నాయబ్, రసూల్, జిలాని, పర్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.70 కోట్లతో అంగన్ వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు

## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం 70కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలకు పరిపాలన సౌలభ్యం కొరకు మొబైల్స్ అందిస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం ఎంపీడీవో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చిన్నారులు, మహిళలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వంచర్యలుతీసుకుంటుందన్నారు. గిరిజన బిడ్డ అంగన్ వాడీకి వచ్చి పౌష్టికాహారం తీసుకునే బాధ్యత సిబ్బంది తీసుకోవాలని ఈ సందర్భంగా చెప్పడం జరిగింది. సర్వేపల్లిలో 39 ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.13.78 కోట్లు మంజూరు అయినట్లు పేర్కొన్నారు. అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లకు ప్రభుత్వం రూ.14వేల విలువైన సెల్ ఫోన్‌ను అందించినామని ఎమ్మెల్యే తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 2934 అంగన్ వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారికి మొబైల్స్ ఇచ్చినట్లు తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా చిన్నారులు, మహిళలకు సేవలు అందించేందుకు మొబైల్స్‌ను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యేపేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చే సూచనలు, ఆదేశాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తాయని సర్వేపల్లి శాసనసభ్యులు అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. అనేక అంగన్ వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. చిన్నారులను సొంత బిడ్డల్లా ఆదరిస్తూ సేవలు అందిస్తున్న అంగన్ వాడీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం వారి సేవలను గుర్తించి వేతనాలను రూ.7 వేలు నుంచి రూ.11500కి పెంచినట్లు తెలిపారు. గిరిజనులు, దళిత బిడ్డలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆయన సిబ్బందికి తెలిపారు. గిరిజన బిడ్డ అంగన్ వాడీ కేంద్రానికి వచ్చి పౌష్టికాహారం తీసుకునేలా చూసుకోవాలన్నారు. 11 గిరిజన కాలనీలను పామాయిల్ కంపెనీలు దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టినామని ఎమ్మెల్యే చెప్పడం జరిగింది. సర్వేపల్లి నియోజకవర్గంలో 39 ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.13.78 కోట్లు మంజూరు చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాళ్లపూడిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.1.43 కోట్లు, ముత్తుకూరు, తాళ్లపూడిలో బ్లాక్ హెల్త్ యూనిట్ల నిర్మాణానికి మరో రూ.కోటి మంజూరు చేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు భవనాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ముత్తుకూరు మామిడిపూడి రోడ్డు నిర్మాణానికి రూ.2.16 కోట్లు చేసినట్లు పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, తాసిల్దార్ స్వప్న, ఎంపీడీవో నాగమణి, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు ఆటపాటలలోనూ రాణించాలి : జేసీ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలలోనూ రాణించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ మెడికల్ కళాశాల గ్రౌండ్స్‌లో నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్‌తోపాటు డిఎస్డివో పాండురంగారావు తదితరులు హాజరయ్యారు. క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మొగిలి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రంగాల్లో ప్రామిణ్యత అవసరమన్నారు. ముఖ్యంగా క్రీడాపోటీలలో కూడా రాణించాలన్నారు. తాను చదువుకునే రోజుల్లో ఇటువంటి క్రీడా పోటీల్లో పాల్గొన్నానని, మానసిక శారీరక దృఢత్వం కోసం క్రీడా పోటీలు చాలా అవసరం అన్నారు. అలాగే విద్యార్థులు మంచి చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. డిఎస్‌డిఓ పాండురంగారావు మాట్లాడుతూ.. విద్యార్థులు కు ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అందుకు నారాయణ విద్యాసంస్థలు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని తెలిపారు. స్కూల్స్ ఏజీఎం శ్రీధర్ మాట్లాడుతూ.. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి సూచనల మేరకు ప్రతి ఏడాది విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు లీగ్ పోటీలతో విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. ఆర్ఐ ఆదిశేషయ్య స్కూల్స్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

# ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మెరుగైన సౌకర్యాల కోసం చర్యలు తీసుకోండి

## దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం బోగోలు మండలంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మెరుగైన సౌకర్యాల కోసం చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. బోగోలు ఎండిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎండిఓ సుబ్రమణ్యంకు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో డ్రైనేజీ కాలువలు లేక, రోడ్లు లేక చెత్తా, చెదారం వేసుకునేందుకు వసతులు లేక కొన్ని కాలనీలు డంప్ యార్డులు లాగా తయారయ్యాయని తెలిపారు. కొన్ని పాత రోడ్లు వలన కంకర లేసి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. చెత్తాచెదారం ఎస్సి, ఎస్టి కాలనీల పక్కన వేస్తున్నారని తెలిపారు. చెరువు పక్కన ఎస్సీ, ఎస్టీ కాలనీలను పట్టించుకోవడం లేదన్నారు. సీసీ రోడ్లు వేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కోట్ల రూపాయిలు ఉన్నప్పటికి ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వలన నిధులు గురించి పట్టించుకోవడం లేదన్నారు. కోట్ల రూపాయిలు నిధులు ఉన్నప్పటికి రుణాలు ఇవ్వక పోగా వెలుగుకు సంబంధించిన బ్రోకర్లు ఎస్సీ, ఎస్టీ నిధులు దుర్వినియోగం చేసి వారి అకౌంట్‌లలో వేసుకొన్నారని తెలిపారు. సబ్‌ప్లాన్ నిధులు 7కోట్ల రూపాయిలు దుర్వినియోగం చేసినట్లు కలెక్టర్‌తేల్చారని తెలిపారు. దొంగపేర్లు పెట్టుకొని నిధులు కాజేసిన విషయం తెలిసినప్పటికి ఏ పార్టీ గెలిస్తే ఆపార్టీ వెంట వుండటం వలన పట్టించుకోవడం లేదని తెలిపారు. చెరువు పక్కన ఉన్న రామస్వామిపాలెం ఎస్సీ, ఎస్టీ కాలేనీల్లో రోడ్లు వేయకపోగా బురద రోడ్లుగా తయారు చేసారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు దుర్వినియోగం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకొని కాలనీల్లో రోడ్లు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాదు ప్రసాద్, నూనె వెంకయ్య, బాబుసుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అశోక్ నగర్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ పరిధిలోని అశోక్ నగర్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపించారు. గ్రామంలోని పిచ్చి మొక్కల తొలగింపు డ్రైనేజీ కాలువల పూడికతీయుట తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు అనారోగ్య పరిస్థితులు ఏర్పడకుండా ఉంటుందన్నారు. దోమలు వృద్ధికాకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు ఏలైన్నంత ఆరోగ్య పరిస్థితులు ఇప్పించేందుకే కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

# పొదుపు సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదగాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పొదుపు సంఘ సభ్యులు ఆర్థికంగా సామాజికంగా బలోపేతం కావాలని ఏపిఎం సుధాకర్ రావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. గ్రామ సంఘాలకు, మండల సమాఖ్యకు మధ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పనిచేయాలన్నారు సమాఖ్యలు మహిళల ఆర్థిక అభివృద్ధికి విజన్ ప్లాన్‌ను రూపొందిస్తూ పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ప్రతి సభ్యురాలు స్త్రీ నిధి బ్యాంకు లింకేజ్ ఉన్నతి, రుణాలను అర్హులకు అందజేసి ఆర్థిక ఆదాయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వారు తీసుకున్న రుణాలను సకాలంలో సక్రమంగా చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు పద్మ ఎల్సిసి లక్ష్మీనరసయ్య సీసీలు సునీత సుశీల లక్ష్మి కుమారి విజయమ్మ ఆదిలక్ష్మి అకౌంటెంట్ సువార్త, వివివోలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో

# ధనుర్మాస కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ధనుర్మాసాన్ని పురస్కరించుకొని తిరుమల నగర్‌లో వేంచేసియున్న కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నాలుగవరోజు కార్యక్రమంకు ఉభయ దాతలుగా గోనుగుంట సురేష్ ధర్మపత్ని సుజాత ఉభయకర్తలుగా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల చారి ఆధ్వర్యంలో ఉభయకర్తలు స్వామివారి పూజా సామాగ్రితో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు కార్యక్రమంలో జరిపించారు. అలాగే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయకర్తలు స్వామి వారి పూజా సామాగ్రితో ముమ్మారు ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా తిరుమల చారి మాస ప్రత్యేకతను విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బంధువులు తదితరులు ఉన్నారు.

# శాంతి మార్గం.. ప్రేమతత్వమే క్రీస్తు సందేశం

## మంత్రి నారాయణ సతీమణి రమాదేవి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** క్రీస్తు సూచించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ ప్రేమ నిండిన మనసుతో జీవించాలని మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి పిలుపునిచ్చారు. గోమతి నగర్‌లోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రీ క్రిస్మస్ సంబరాలను మంత్రి సతీమణి రమాదేవి అంగరంగవైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పొదలకూరు చర్చి సిబ్బంది చేసిన పరివర్తన నాటక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆసక్తిభరితంగా సాగాయి. శాంతా క్లాక్ తాత వేషధారణ చిన్నారులను ఆకట్టుకుంది. అద్భుతమైన ప్రదర్శన చేసి అందరినీ అబ్బురపరిచిన చిన్నారులను పొంగూరు రమాదేవి అభినందించారు. ఈ సందర్భంగా క్రైస్తవ మతపెద్దలు క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించి, ప్రత్యేకప్రార్థనలు చేశారు. కాండిల్స్ వెలుగులో కేక్ కట్ చేసిన రమాదేవి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. 2026 క్రిస్టియన్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ కానుకలు అందజేశారు. అనంతరం రమాదేవి ప్రసంగిస్తూ క్రిస్మస్ అంటే మానవాళికి శాంతి, కరుణ పంచే దేవుడు భూమిమీదకు వచ్చిన రోజు అని తెలిపారు. నీతోపాటు నీ పొరుగువారిని ప్రేమించమనేది క్రీస్తు బోధనగా ఆమె పేర్కొన్నారు. తన అత్తయ్య కూడా ఇరుగు చల్లన, పొరుగు చల్లన అని పూజలు చేసేవారనీ, తనకూ అలాగే అలవాటు చేసారని గుర్తు చేశారు. క్రీస్తు సూచించిన శాంతిమార్గంలో ప్రేమతత్వంతో పయనిద్దామని పిలుపునిచ్చారు. ఈ క్రిస్మస్ అందరి జీవితాల్లో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు నింపాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ ప్రిక్రిస్మస్ వేడుకల కార్యక్రమంలో డాక్టర్ మల్లి దొరసాని, ఐఆర్ఎస్ అధికారి ఉషాకిరణ్,క్రిస్టియన్ మత పెద్ద డేవిడ్ దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# గళమెత్తిన ప్రజా సంఘాలు

- తిరుపతి వద్దు, నెల్లూరు ముద్దు అంటూ నిరసన సెగలతో రగిలిపోతున్న సైదాపురం
- నిర్మాస్యంగా మారిన సైదాపురం బస్టాండ్





**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలాన్ని నెల్లూరు జిల్లా లో కొనసాగించాలని కోరుతూ సైదాపురం మండలం కేంద్రంలో నిరసన దీక్షలు నాలుగో రోజు చేరుకున్న సందర్భంగా జేఏసీ యిచ్చిన పిలుపుతో శుక్రవారం వ్యాపారాలు, స్కూల్‌లు, జూనియర్ కాలేజ్ మూత పడింది. ప్రజలు స్వచ్ఛందంగా సైదాపురంను నెల్లూరు జిల్లాలో ఉంచాలని ముందుకొచ్చి బంద్‌ను పాటించారు. దీంతో సైదాపురంలో బంద్ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు పూలే టీచర్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు తుమ్మా రవి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తరువాత జిల్లాల పునర్వ్యవస్థీకరణ నాటి ప్రభుత్వం నుండి నేటి ప్రభుత్వం వరకు జరుగుతూనే వుందన్నారు. ప్రజల అభిప్రాయం లేకుండా ఏకపక్షంగా మంత్రుల కమిటి నీ తీసుకొచ్చి సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలను 40 కిలోమీటర్లకు దూరంలో వున్న నెల్లూరు జిల్లా కేంద్రాన్ని దూరం చేసి 160 కిలోమీటర్ల దూరంలో వున్న తిరుపతిలో కలిపే విధంగా దుర్మార్గంగా ప్రకటించిందని దాన్ని వెంటనే వెనక్కి తీసుకుని మూడు మండలాలను నెల్లూరు జిల్లా లో కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. జేఏసీ కో కన్వీనర్ షఫీ హరన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వాన్ని గెలిపించినందుకు మంత్రుల కమిటి పేరుతో అక్రమ నివేదికలు తెప్పించి మూడు మండలాలను తిరుపతిలో కలపాలన్న ప్రతిపాదనను ప్రజలు ఈ ప్రభుత్వం తీరు పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని మండి పడ్డారు. ప్రజలు మూడు మండల లను కలిపే ప్రతి పాదనను వెనక్కి తీసుకోకుంటే వచ్చే ఎన్నికల్లో గుణ పాఠం తప్పదని గుర్తించాలని హెచ్చరించారు. మాదిగ దండోరా మండల నాయకులు గంగాధర్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వం మూడు మండలాలను తీసి తిరుపతిలో కలిపే ప్రతి పాదన తీసుకు రావటం పట్ల ప్రజలు ఆందోళన ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారన్నారు. అప్రతిపాదన ను విరమించుకుని నెల్లూరు జిల్లాలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. జేఏసీ మండలం కన్వీనర్ డీపీ పోలయ్య మాట్లాడుతూ.. బడా కార్పొరేట్ శక్తులు ధనార్జన కోసం ప్రజల అభిప్రాయం లేకుండా తిరుపతి జిల్లాలో మూడు మండలాలను కలుపుకోవాలని మంత్రుల కమిటి తో చీకటి ప్రతిపాదనను తీసుకురావడం ప్రజల్లో నెల్లూరు జిల్లా లో మూడు మండలాలను కొనసాగించాలని డిమాండ్‌తో పోరాటాలకు సచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. ప్రజలు కొత్త సంవత్సరం సంక్రాంతి పండుగలు ప్రశాంతంగా సంతోషంగా జరుపుకోవా లాంటే నెల్లూరు జిల్లాలో సైదాపురం రాపూరు కలువాయి లను యథావిధిగా నెల్లూరులో కొనసాగించాలిలేదా గూడూరును జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూలే టీచర్ ఫెడరేషన్ నాయకులు జివి రత్నం, బి.ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు పి.సోమయ్య, ఆర్‌వి రమణయ్య, బిజెపి నాయకులు వి.రఘు రామ్, టి.చిట్టి బాబు, కె.పరంధామయ్య, ఏపిటిఎఫ్ నాయకులు కె.రవి, ఎన్.వెంకటేశ్వరవర్మ, ఎస్‌డి షరీఫ్‌బాబు, ఎం.చిరంజీవి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కె.చంగల్ రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కాపు జేఏసీ మండల యువజన అధ్యక్షుడిగా పోలిశెట్టి మహేంద్ర రాయల్



**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండల కాపు జేఏసీ (జీూజ) యువజన అధ్యక్షులుగా పోలి శెట్టి మహేంద్ర రాయలు నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస నాయుడు ఆయనను అధికారికంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాస నాయుడుకు మహేంద్ర రాయలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. మండలంలోని కాపు యువతను ఐక్యం చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి, సామాజిక అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ నియామకం పట్ల మండలంలోని పలువురు ప్రముఖులు, కాపు సంఘం నాయకులు, యువత హర్షం వ్యక్తం చేస్తూ మహేంద్ర రాయలుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నదులను జాతీయ సంపదగా ప్రకటించాలి : మిడితల



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** రాయలసీమ నెల్లూరు జిల్లాలలో కృష్ణా జలాలు ప్రవాహాన్ని తెలంగాణ అభ్యంతరాలు ప్రకృతి ధర్మానికి విరుద్ధం ఉన్నాయని బీజేపీ నమామి గంగి రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలని కృష్ణ ట్రిబ్యునల్‌లో ఆంధ్రప్రదేశ్ వాదనల ప్రజెంటేషన్ అద్భుతంగా వుంది. నదీ జలాలను జాతీయ సంపదగా ప్రకటించాలని రమేష్ తనపై అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రాల విభజన సమయంలో కృష్ణా జలాలు పెన్నా బేసిన్‌కు మళ్లించుకునేందుకు విభజన చట్టం ఆమోదించింది. రాయలసీమ నీటి దుర్భిక్ష ప్రాంతం. 1981 నాటికి ముందే శ్రీశైలం నుండి కృష్ణా జలాలు రాయలసీమలో ప్రవేశిస్తున్నాయి. మహారాష్ట్ర కర్ణాటక ఆంధ్రప్రదేశ్ అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం 1988లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మించారు. పై ప్రాంతం నుండి నీరు క్రింది ప్రాంతాలకు ప్రవహించడం ప్రకృతి సహజ ధర్మం. తెలంగాణలో ఓట్ల కోసం పార్టీలు నీటి సహజ సిద్ధ ప్రకృతి ధర్మనికి విరుద్ధంగా పోరాటాలు చేస్తున్నాయని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇన్‌చార్జ్ మేయర్‌కి అభినందనలు

- జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ప్రజా క్షేత్రంలో నిరంతరం అందుబాటులో ఉండే ప్రజల మనిషి.. రాజకీయంలో ఎటువంటి కష్టాన్నైనా ఎదుర్కొగలిగిన సమర్ధుడు.. నమ్మిన పక్షాన్ని గెలిపించడంలో వెనుదురుగని వీరుడు.. రూప్ కుమార్ యాదవ్ ఇన్‌చార్జ్ మేయర్‌గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ప్రజల ప్రతి అవసరాన్ని సకాలంలో తీరుస్తున్న కూటమి ప్రభుత్వంలో మరింత అభివృద్ధి, సంక్షేమం కార్పొరేషన్ ప్రజలకి అందించాలని కోరుకుంటూ వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న రూప్ కుమార్‌కి జనసేన నాయకులను, జనసైనికులను కూడా దిశా నిర్దేశం చేసి రాజకీయంగా అభివృద్ధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, పట్టణ కార్యదర్శి హేమచంద్రయాదవ్, డివిజన్ నుంచి నాయకులు నరహరి, వర్షన్, సుధాకర్ ననరహరి, కృష్ణమోహన్ రెడ్డి, అశోక్, శరవణ, మౌనేష్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలియో నిర్మూలనపై అవగాహన ర్యాలీ




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలంలో చలంచర్ల గ్రామంలో శుక్రవారం ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పోలియో నిర్మూలనపై పాఠశాల విద్యార్థులతో కలసి గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ అధికారి భాను మహేష్ మాట్లాడుతూ.. డిసెంబర్ 21వ తేదీన ఆదివారం పోలియో నిర్మూల దినం సందర్భంగా గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలియో నిర్మూలనపై ర్యాలీ నిర్వహించామని తెలిపారు. నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో, అప్పుడే పుట్టిన బిడ్డనుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని గ్రామ ప్రజలకు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించడం జరిగింది. పిల్లలకు తప్పనిసరిగా వేయించి వారి భవిష్యత్తును సురక్షితంగా చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కామేశ్వరి, ఆశా వర్కర్లు కమల, కామేశ్వరి, సునీత, సంధ్య, చలంచర్లపాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీఎస్‌యూలో రచనా శైలిపై ప్రత్యేక సదస్సు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో, పీఎంఉషా సహకారంతో నిర్వహిస్తున్న 'క్రియేటివ్ రైటింగ్ అండ్ ప్రొఫెషనల్ కంటెంట్ డెవలప్‌మెంట్' 12 రోజుల ప్రత్యేక కోర్సు విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కోర్సులో భాగంగా శుక్రవారం నాల్గవ రోజు రచనా శైలిపై ప్రత్యేక విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రిసోర్స్ పర్సన్‌గా రాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.హనుమంతయ్య హాజరై ప్రసంగించారు. సృజనాత్మక రచనల్లో సాంస్కృతిక స్పృహ, స్థానికత, ప్రామాణికత ఎంతో కీలకమని ఆయన వివరించారు. ఆంగ్లంలో రచనలు చేసే సమయంలో స్థానిక ఆచారాలు, సంప్రదాయాలు, భావోద్వేగాలను సున్నితంగా ప్రతిబింబించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఉదయం జరిగిన 'సందర్భోచిత సంస్కృతి' అంశంపై సెషన్‌లో రచన సందర్భానికి అనుగుణంగా ఉండాలని, భాషా ప్రయోగంలో కచ్చితత్వం అవసరమని తెలిపారు. అనంతరం జరిగిన స్టైలిస్టిక్స్ సెషన్‌లో గద్యంలో లయ, భాషా అలంకారాలు, రచయిత తనకంటూ ప్రత్యేకమైన రచనా శైలిని ఎలా అభివృద్ధి చేసుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.మధ్యాహ్నం నిర్వహించిన 'అనువాదం అండ్ అనుసృజన' సెషన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక భాషలలోని పాఠ్యాలను సాంస్కృతిక సారాంశం చెడిపోకుండా ఆంగ్లంలోకి అనువదించే విధానాన్ని ఆచరణాత్మకంగా వివరించారు. అలాగే 'క్రాస్ కల్చరల్ రైటింగ్ సవాళ్లు' అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పీఎంఉషా కోఆర్డినేటర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, వీఎస్‌యూ ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బిఎస్ఎస్ భగవాన్ పర్యవేక్షించగా, కో–కోఆర్డినేటర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ప్రభాకర్ వ్యవహరించారు. ఈ సదస్సులో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ బి.శామ్యూల్ మార్క్, వి.భాగ్య జోత్స్న, టి.పాల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌తో పాటు విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# కోడూరు ప్రాథమిక వైద్యశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో కే.వెంకటేశ్వర రావు హాజరైనారు. ఇటీవల వీలుకానిపల్లి కళ్యాణ మండపంలో జిల్లాల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుల సమావేశం సందర్భంగా పిహెచ్సి వైద్యురాలు హేన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ దృష్టికి అదేవిధంగా ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి దృష్టికి తేవడం జరిగింది దీంతో స్పందించిన బీజేపీ నేతలు కోడూరు స్థానిక బీజేపీ నేత వేళ్ళపాలెం శ్రీనివాసులు రెడ్డి తోడ్పాటుతో బీజేపీ నేతలు సంయుక్తంగా వైద్యశాల ఆవరణాన్ని శుభ్రపరిచారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ బీజేపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారుమెడికల్ ఆఫీసర్ సిబ్బంది బీజేపీ నేత ఇతర నాయకులను శ్రీనివాసులు రెడ్డిని సన్మానించారు. బీజేపీ నాయకులు తమ సందేశాలలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం పురస్కరించుకొని వైద్యశాలలో పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్స్ చేసినట్లు వివరించారు. వైద్యశాలలో ప్రధాని నరేంద్ర మోడీ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ చిత్రపటాలను కోడూరు సచివాలయంలో ప్రధాని చిత్రపటాన్ని నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సిబ్బందితోపాటు పంచాయతీ కార్యదర్శి పెంచలయ్యమండల బిజెపి అధ్యక్షులు టి.అనిల్ కుమార్ సీనియర్ నాయకులు వి.శ్రీనివాస్ రెడ్డి, టీ జనార్ధన్, ఎం.శ్రీనివాసులు, కే.వెంక రెడ్డి, ఈ నాగేశ్వరరావు వి.అంజయ్య విజయ్ కుమార్, సిహెచ్ వెంకటరమణయ్య, డి.హేమంత్ కుమార్, పి.ప్రశాంత్ కుమార్ పి.శ్రీనివాసులు, రవి, గోపాల్, సుబ్బయ్య, ఎస్.వేణు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలతో బోలెడు అనర్థాలు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బాల్యవివాహాలతో బోలెడు అనర్థాలు చోటుచేసుకుంటాయని, బాల్యవివాహాలు చట్టరీత్యానేరమని ఐసీపీఎస్ పీఓ సి.హెచ్.సమత పేర్కొన్నారు. బాల్యవివాహముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆత్మకూరులోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఐసిపిఎస్, ఏసిడిఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమత ప్రసంగిస్తూ 18సంవత్సరాలలోపు బాలికలు, 21సంవత్సరాలలోపు బాలురు వివాహాలు చేసుకోరాదని, చట్టరీత్యా ఆ వయసులు దాటాకనే వివాహాలు చేసుకోవాలని సూచించారు. బాల్యవివాహాల వలన ఆరోగ్యపరంగా పలు నష్టాలుంటాయని ఆమె వివరించారు. బాల్యవివాహ నిరోధక చట్టం2006, బాలికపై జరిగే వేధింపుల నిరోధకచట్టం 2012, బాలల హక్కుల గురించి 112హెల్ప్‌లైన్ గురించి ఆమె వివరించారు. బాల్యవివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని, బాల్యవివాహాల కలిగెడి నష్టాల గురించి అందరూ అవగాహన పెంపొందించుకోవాలని ఆమె కోరారు. సహాయకార్మికశాఖాధికారి ఎన్.హరిబాబు మాట్లాడుతూ.. బాల్యవివాహాలతోపాటు బాలకార్మికులుగా మారడం కూడా చట్టరీత్యానేరమని, అందుకు ప్రత్యేక చట్టాలున్నాయని పేర్కొన్నారు. విద్యార్థినిలు బాల్యవివాహాలు, బాలకార్మికుల గురించి తెలిస్తే వెంటనే ఆన్‌లైన్‌కు ఫోన్‌చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఐసిపిఎస్ ప్రతినిధి సుమ, సిజెడబ్ల్యుఎస్ స్వచ్ఛందసంస్థ సిబ్బంది, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయిని ఏవీఎస్ చంద్రకళ, ప్రధానోపాధ్యాయిని కె.కోటేశ్వరమ్మ, వ్యాయామ ఉపాధ్యాయిని సుమతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జి.కస్తూరి, డి.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.రాధ, కె.రమణమ్మ, హమీదున్నీసా, ఉపాధ్యాయినిలు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ పేట పోలీస్ స్టేషన్ తనిఖీ : డీఎస్పీ




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట పోలీస్ స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ కే.వేణుగోపాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులను, క్రైమ్ రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. అలాగే గత సంవత్సరం కంటే క్రైమ్ రేట్ తగ్గించినందుకు ఎస్సైని సిబ్బందిని అభినందించారు. అలాగే స్టేషన్ లోని సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంగం సీఐ వి.శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ ఏ.సైదులు, ఏఎస్ఐలు, భాస్కర్ రెడ్డి, విక్రమ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫ్లోరో సిస్ వ్యాధి పరీక్షలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నెల్లూరు జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారిని డాక్టర్ దివ్య చిన్నక్రాక గ్రామం లోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇతర ఎముకలకు సంబంధించిన ఫ్లోరోసిస్ వ్యాధి నిర్ధారణకు పరీక్షలు జరిపి ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన కల్పించారు. మనం తాగే నీటిలో కానీ, తీసుకునే ఆహారంలో గాని ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉన్నట్లయితే దంతాలు ఎముకలు, శరీరం అవయవాలు ఫ్లోరోసిస్కు గురై దంతాలు గార పట్టి బలహీనపడటం, ఎముకలు బలహీనపడి వంకర్లు పోవడం, నడుములు, మెడలు బిగుసుకుపోవడం, వంగిపోవడం తదితర అనారోగ్య సమస్యలు గురై వ్యాధిగ్రస్తులు కావటం జరుగుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఉమాకుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ధనలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త శ్యామల, నీలిమ ఆశ కార్యకర్తలు రాజేశ్వరి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కోడూరు కుటుంబాన్ని పరామర్శించిన బొమ్మిరెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ఇటీవల మృతిచెందిన మాజీ ఎంపిటిసి మెంబర్, మండల కాంగ్రెస్ విప్ కోడూరు రామయ్య కుటుంబాన్ని శుక్రవారం బొమ్మిరెడ్డి కుటుంబయువనేత, బిఎస్ఆర్‌ట్రస్ట్ చైర్మెన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల రామయ్య అనారోగ్యంతో మృతిచెందిన విషయం విధితమే. కాగా తారక్‌నాథ్‌రెడ్డి ఆయన ఇంటికెళ్ళి రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి వారికి సానుభూతి తెలిపారు. తమ కుటుంబానికి ఎంతో సన్నిహితంగా రామయ్య ఉండేవారని ఆయన పేర్కొన్నారు. రామయ్య కుమారులు భార్గవ్, నవీన్‌లను ఓదార్చి ఆకుటుంబానికి తమవంతుగా అండగా ఉంటామని తారక్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

# వెలుగు ఏపీఎంలకు, సీసీలకు, అకౌంటెంట్‌లకు శిక్షణ

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం ఆధ్వర్యంలో 10 మండలాల ఏపీఎంలకు, సీసీలకు, అకౌంటెంట్‌లకు, రూరల్ మండలం విఓఏలకు, ఈసి సభ్యులకు, ఎంసీఎల్ఫ్ విజన్ బిల్డింగ్ 2 పై ముందు రెండు రోజులు జరిగిన శిక్షణ కార్యక్రమములో సభ్యురాలి కల, సంఘం కల, కుటుంబం కలలను మూడు టీమ్‌లుగా ఏర్పాటు చేసి మూడు కలలను ముగ్గుల రూపంలో తెలియజేయడం జరిగింది. ఈ యొక్క శిక్షణా కార్యక్రమంకు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పాల్గొనడం జరిగింది. అనంతరం మూడు రోజుల శిక్షణ కార్యక్రమంను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. కలలు నేర వేర్చుకోవాలి అంటే ముందు మన యొక్క ఆలోచన విధానం మార్చుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా గ్రామసంఘం స్థాయిలో ప్రతి సభ్యురాలికి మనం తెలియజేయవలసిన విషయం ఏమిటంటే ప్రతి సభ్యురాలు వారి కుటుంబ సభ్యులతో కలసి ప్రేమతో, బాధ్యతతో మెలిగి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించుకోవాలి అప్పుడే తన కలలను సాకారం చేసుకోగలరని తెలియజేయడం జరిగింది. ఈ యొక్క ఎంసీఎల్ఎఫ్ శిక్షణ కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్లు, నెల్లూరు రూరల్ విఓఏలు, ఈసి సభ్యులు, నెల్లూరు రూరల్ మండలం మండల సమైక్య కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మకూరులో 17మందికి నామినేటెడ్ పదవులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలో 17మంది టీడీపీ నాయకులకు వివిద స్థాయి నామినేటెడ్ పదవులు లభించాయి. మంత్రి ఆనం ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహి స్తున్న ఈనియోజకవర్గానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, ప్రాంతీయ నామి నేటెడ్ పదవులు ఇప్పటివరకు లభించాయి. అదే ఆనం మార్కు అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. కాగా ఇంకా కొన్ని కార్పోరేషన్ పదవులు, రాష్ట్ర, జిల్లా స్థాయి పార్టీ పదవులు కూడా ఆత్మకూరు నియోజకవర్గానికి రానున్నాయని మంత్రి ఆనం ఇటీవల ఓసభలో పేర్కొనడంతో మరి కొంతమంది ఆశావహుల్లో పదవులు దక్కనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో వివిద కార్పోరేషన్ డైరెక్టర్లుగా మర్రిపాడు మండలానికి చెందిన పుట్టం శ్రీనివాసులురెడ్డి, కటారి రమణయ్యలకు పదవులు దక్కగా ఇదే మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి శాంతకుమారికి జిల్లా గ్రంధాలయసంస్థ చైర్మెన్ పదవి లబించింది. అనంతసాగరం మండ లానికి చెందిన మెట్టుకూరు ధనుంజయరెడ్డికి జిల్లా కేంద్ర సహకారబ్యాంక్ చైర్మెన్ పదవి లభించింది. ఏఎస్‌పేట మండలానికి చెందిన అబ్బూరు రమేష్ నాయుడుకు రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ పదవి లభించింది. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి మర్రిపాడు మండలానికి చెందిన ఆరి కట్ల జనార్ధన్‌నాయుడును వరించింది. మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మెన్ పదవి ఆత్మకూరుకు చెందిన గొట్టిగుండాల బుజ్జిరెడ్డికి లభించింది. ఆత్మకూరు మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడు కోడలు కంచర్ల మాధవికి రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ పదవి లభించింది. చేజర్ల మండలానికి చెందిన మాజీ జెడ్పిటిసి సభ్యురాలు షేక్ సల్మాషిరీన్‌కు రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ పదవి లబించింది. ఇదే మండలానికి చెందిన వేలూరు కేశవచౌదరికి సోమశిల ప్రాజెక్టుకమిటీ చైర్మెన్ పదవి లభించింది. ప్రాధమిక వ్యవసాయపరపతి సంఘాలకు కూడా నామినేటెడ్‌గా చైర్మెన్లు నియమితులయ్యారు. ఆత్మకూరు సిండికేట్ రైతుసేవా సంఘం చైర్మెన్‌గా పరిటాల సత్యనారాయణ, ఆత్మకూరు మండలం బట్టేపాడు సొసైటి చైర్మెన్‌గా తూమాటి ధనుంజయరెడ్డి, వెన్నవాడ సొసైటి చైర్మెన్‌గా కొల్లి నరసయ్య నాయుడు, మర్రిపాడు మండలం భీమవరం సొసైటి చైర్మెన్‌గా యర్రమల్ల చిన్నారెడ్డి, బూదవాడ సొసైటి చైర్మెన్‌గా వనిపెంట వెంకటసుబ్బారెడ్డి, ఏఎస్‌పేట రాజవోలు సొసైటి చైర్మెన్‌గా కాటంరెడ్డి నారశిం హారెడ్డి, సంగం సొసైటి చైర్మెన్‌గా గుండ్లపల్లి శ్రీనివాస యాదవ్, చేజర్ల సొసైటి చైర్మెన్‌గా బూదళ్ళ వీరరాఘవరెడ్డిలు నియమితుల య్యారు. అందరూ ప్రమాణస్వీకారాలు చేసి తమ విధుల్లో కొనసాగుతు న్నారు. ఇంకా ఎవరెవరికి నామినేటెడ్ పదవులు దక్కనున్నాయో చూడాల్సి ఉంది.

# సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ మేయర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ వారాంతపు సమీక్ష సమావేశంలో భాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ పాల్గొని అధికారులు కార్యదర్శులతో మాట్లాడారు. మేయర్‌గా తాను ఉన్న పదవీకాలంలో నూతన సంస్కరణలతో నగరవ్యాప్తంగా కొత్త మార్పు కనబడేందుకు దోహదపడాలని ఆకాంక్షించారు. నాలుగవ అతిపెద్ద కార్పొరేషన్‌గా ఉన్న నెల్లూరుకు రాబడి పెంచుకునే మార్గాలను సుగమం చేసుకుంటూ, దుబారా ఖర్చులను పూర్తిస్థాయిలో తగ్గించుకుందామని మేయర్ సూచించారు. ఎల్ఆర్ఎస్, బిపిఎస్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ.. ప్లానింగ్ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న ఎల్ఆర్ఎస్ పాటర్న్లు పరిశీలించి వెంటనే తదుపరి అనుమతుల కొరకు అధికారులకు పంపవలసిందిగా ఆదేశించారు. అలాగే గత వారం నుంచి ఈ వారంలోపు జరిగిన ఎల్.ఆర్.ఎస్ పాటర్న్లు గురించి కార్యదర్శి వారీగా సమీక్షించారు. అలాగే సచివాలయ పరిధిలోని అడ్వర్టైజ్మెంట్ పన్నులు, టెంపరరీ ఎంక్రోచ్మెంట్ పన్నులు గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు నివేదికను అందించవలసిందిగా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి ఆదాయం వనరులు సమకూరేల ప్రతి కార్యదర్శి పనిచేయాలని నిర్దేశించారు. సచివాలయ పరిధిలోని గవర్నమెంట్ ఆస్తులను గుర్తించి వివరములను అందజేయవలసిందిగా ఆదేశించారు. కార్యాలయ పురోగతి పై నిర్దేశించిన పనులను తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, సూపరిండెంట్ ప్రవీణ్ కుమార్, టీపీబివోలు, ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జోరందుకున్న అక్రమ రేషన్ బియ్యం రవాణా

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో అక్రమ రేషన్ బియ్యం రవాణా ఉధృతంగా కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేద ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని కొందరు దళారులు కిలోకు సుమారు రూ.15 చొప్పున కొనుగోలు చేసి, మొన్న





తాటిపర్తి పాలెంలో నిన్న తిక్కవరపాడులో ఇలా రోజుకొక ఊరిలో రేషన్ బియ్యం కలెక్షన్ ఏజెంట్లుగా ఏర్పడి ఆటోలు, లారీల ద్వారా నెల్లూరులోని కొన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం. అక్కడ బియ్యాన్ని పాలిష్ చేసిన అనంతరం వేరే బ్రాండ్లు కంపెనీ పేర్లు ఉన్న సంచులలో ప్యాకింగ్ చేసి తమిళనాడు, కృష్ణపట్నం పోర్టు తదితర మార్గాల ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేసి కోట్ల రూపాయల అక్రమ లాభాలు ఆర్జిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి–పగలు తేడా లేకుండా రేషన్ షాపుల పరిసరాల నుంచే ప్రభుత్వం సరఫరా చేసే సంచులతోనే బియ్యాన్ని తరలిస్తున్నారని చెబుతున్నారు. ఈ అక్రమ రవాణాపై సంబంధిత అధికారులకు పలుమార్లు సమాచారం అందించినప్పటికీ కఠిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో అక్రమ రేషన్ బియ్యం మాఫియాపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నలిశెట్టికి నివాళులర్పించిన మంత్రి తనయుడు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఉపమండలాధ్యక్షుడు, మాజీ పంచాయతీ పాలకవర్గ సభ్యుడు, తెలుగుదేశం నాయకుడు నలిశెట్టి శ్రీనయ్య గురువారం ఆకస్మికంగా మృతిచెందగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడలో ఉన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీనయ్య మృతికి నివాళులర్పించి కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. పార్టీ కష్టకాలంలో ఉండగా శ్రీనయ్య జెండామోశారని, తనకెంతో ఆత్మీయుడు, నమ్మకస్థుడని, ఆయన మృతి తీరని లోటు అని మంత్రి పేర్కొన్నారు. శ్రీనయ్య మృతిసమాచారంతో రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమారుడు ఆనం శుభకర్‌రెడ్డి ఆత్మకూరుకు విచ్చేసి శ్రీనయ్య మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి వారికి సానుభూతి తెలిపారు. నలిశెట్టి మృతి పార్టీకి తీరనిలోటుగా శుభకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆకుటుంబానికి తమవంతుగా అండగా ఉంటామని పేర్కొన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను మూడు దశలుగా నిర్వహించిన అంతర కళాశాలల స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలో అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆహార, విజ్ఞాన, సాంకేతిక కళాశాల పులివెందుల, తిరుపతి శ్రీవెంకటేశ్వర, కింజారపు ఎర్రన్నాయుడు వ్యవసాయ విజ్ఞాన కళాశాలల్లో మూ డు దశల్లో నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటి ప్రశంసాపత్రాలు, మెమోంటోలు పొందారన్నారు. ఈ సందర్భంగా సమావేశం నిర్వహించిన వారిని ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. విద్యార్థుల బృందానికి నాయకత్వం వహించిన అచార్యులు గోపికృష్ణ కిషన్దేజ, లావణ్యకుమారి, సూర్యకళ, రమేష్, షాహిద్లను ప్రశంసించారు.

## నలిశెట్టి కుటుంబాన్ని పరామర్శించిన బొమ్మిరెడ్డి





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో తెలుగుదేశం నాయకుడు, మాజీ ఉపమండలాధ్యక్షుడు నలిశెట్టి శ్రీనయ్య కుటుంబాన్ని శుక్రవారం బొమ్మిరెడ్డి కుటుంబానికి చెందిన యువనాయకుడు, బిఎస్ఆర్‌ట్రస్ట్ చైర్మెన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి పరామర్శించారు. శ్రీనయ్య గురువారం గుండెపోటుకు గురై మృతిచెందిన విషయం తెల్సిందే. తారక్‌నాథ్‌రెడ్డి శ్రీనయ్య ఇంటికి వచ్చి పరామర్శించారు. శ్రీనయ్య భార్య, ముగ్గురు కుమారులను ఆయన ఓదార్చారు. శ్రీనయ్య మృతికి ప్రగాఢ సంతాపం తెలిపి కుటుంబసభ్యులను సానుభూతి తెలిపారు.

శ్రీనయ్య మృతిసంఘటన గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. తమ కుటుంబానికి ఎంతో సన్నిహితుడుగా ఉండేవారని, నాయకుడుగా, ప్రజాప్రతినిధిగా అందరి మన్ననలు పొందిన నేతగా కొనసాగారని ఆయన పేర్కొన్నారు. ఆయన మృతి అత్యంత బాధాకరమని తారక్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీనయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు మనోధైర్యం భగవంతుడు ప్రసాదించాలని బొమ్మిరెడ్డి పేర్కొన్నారు.

# గత వైసీపీ పరిపాలనలో ఒక జాబ్ మేళా నిర్వహించారా?

## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి






**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పరిపాలనలో ఒక్కసారైనా సర్వేపల్లి నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించినారా అంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం మత్స్య కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ జిల్లా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే సోమిరెడ్డి పాల్గొని ప్రారంభించారు. 15 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. కళాశాల అసోసియేటెడ్ డాక్టర్ కే ధనపాల్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారి అబ్దుల్ ఖయ్యూం, మండల టిడిపి అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, జనరల్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో నాగమణి, తాసిల్దార్ స్వప్న, మండల తెలుగు యువత కమిటీ అధ్యక్షుడు రాగాల శివకృష్ణ, అధికార పార్టీ నాయకులు దువ్వూరు గోపాల్ రెడ్డి, మారంరెడ్డి విక్రమ్ రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిపాలనలో పారిశ్రామిక అభివృద్ధి ముందంజలో ఉందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్వహణ విషయంలో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను గత ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టిందని అమానుషంగా ప్రవర్తించడం ఇప్పటికే మర్చిపోలేమన్నారు. 10 లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన జరుగుతుందని ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. కృష్ణపట్నం రిలయన్స్ భూముల్లో అనేక పరిశ్రమలు నెలకొల్పే విధంగా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఆదాయం పెంచేందుకు కృషి చేయండి

## ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఇంచార్జ్ మేయర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో కమిషనర్‌తోపాటు అన్ని విభాగాల అధికారులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఆదాయం పెంచేందుకు ప్రతి ఒక్క అధికారి మనస్ఫూర్తిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలు వారికి సంబంధించిన ఆదాయ మార్గాలలో మరింత ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకొని కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడాలని సూచించారు. ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలలో దుబారా ఖర్చులు తగ్గించి, కార్పొరేషన్ వనరులు వృధా కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కమిషనర్ వై.ఓ నందన్ మాట్లాడుతూ.. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పరకాల అమలు ద్వారా రాబడిని పెంచేందుకు విశేషంగా కృషి చేస్తున్నామని వివరించారు. మొండి బకాయిలకు సంబంధించిన ఆస్తిపన్నులు, తాగునీటి కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులను వసూలు చేసేందుకు లోక్ అదాలత్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలను పటిష్టంగా అమలు చేస్తున్నామని కమిషనర్ తెలియజేశారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, టిపిఆర్ఓ వాసు బాబు, మేనేజర్ రాజేశ్వరి, ఇంజనీరింగ్ విభాగం ఈఈలు శేషగిరిరావు, రహంతు జానీ, అనిల్ కుమార్, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# అమ్మవారి రాహుకాల ఉద్యాపన పూజ







**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం విశేషంగా రాహుకాల ఉద్యాపన పూజలో 28 మంది పాల్గొని శ్రీ అమ్మవారికి చీర జాకెట్టు, 108 నిమ్మకాయల మాలలు సమర్పించారు. రాహుకాల దీపాలు చేసిన శ్రీ అమ్మవారిని దర్శించుకొన్న భక్తులు. ప్రతి శుక్రవారం భక్తుల విరాళాల ద్వారా దేవస్థానం తరపున అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. దేవస్థానం ఛైర్మన్ రత్నం జయరామ్ సతీమణి కళ్యాణి అన్నదానంకు రూ.1,00,116/-లు విరాళంగా ఇవ్వడం జరిగింది. అన్నదాన కార్యక్రమం ను బయోమెట్రిక్ విధానము ద్వారా నిర్వహించుట జరుగుతుంది. ఈ శుక్రవారం రెండు వేల మంది భక్తులకు అన్నదాన ప్రసాదం వినియోగించుకున్నారు. ధనుర్మాసం సందర్భంగా ఈ నెలరోజులు ఆలయం ఉదయం 5.45 గంటల నుండి శ్రీ అమ్మవారి దర్శనం జరుగుతుంది. ప్రతిరోజు అమ్మవారికి కట్టుపొంగలి నివేధన చేయడం జరుగుతుంది. సాయంత్రం వేదపారాయణం, సంధ్యామేళం, రాత్రి కుంభ హారతులు, పల్లకీ సేవ కార్యక్రమాలు జరిగాయని సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

# వీఎస్‌యూలో.. వర్క్‌షాప్ ముగింపు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కంప్యూ టర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీ జాతీయ వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా ముగిసింది. కేంద్ర ప్రభుత్వ పథకం పీఎంఉష ఆర్థిక సహకారంతో ఈ వారం రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా డ్రోన్ టెక్నాలజీపై నైపుణ్యం సాధించాలని సూచించారు. పరిశోధనలు, వ్యవసాయం, రక్షణ రంగాల్లో డ్రోన్ల వినియోగం విస్తరిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ ఆచార్య జి.రాజా రామిరెడ్డి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఐఐటిడిఎం కర్నూలుకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నరేష్‌బాబు పాల్గొని ప్రసంగించారు. డ్రోన్ తయారీ, ఆపరేషన్, అప్లికేషన్లపై విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన కల్పించడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. వర్క్‌షాప్ కోఆర్డినేటర్‌గా ఆచార్య అందే ప్రసాద్, కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.ఉస్సేనయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.విజయలక్ష్మి, డాక్టర్ ఎన్ఓ గోపాల్, డాక్టర్ ఏ.శివశంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్. విజయ, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# పలు అంశాలపై సమీక్షించిన సీడీఎం



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.సంపత్ కుమార్ వివిధ అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ వైఓ నందన్ అధికారులతో కలిసి హాజరయ్యారు. సమావేశంలో రెవెన్యూ వసూళ్లు మరియు ఆటోమ్యూటేషన్, యానిమల్ భర్త్ కంట్రోల్, అన్నా క్యాంటీన్లల నిర్వహణ, ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఏర్పాట్లు, స్వచ్ఛ సర్వేక్షణ, ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారము చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాల అమలు ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కమిషనర్ కార్యాలయ వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీడీఎంఏ నిర్దేశించిన అంశాలకు అత్యంత ప్రాధాన్యత కల్పించి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర పాలక సంస్థ సెక్రెటరీ శ్రీలక్ష్మి, టిపిఆర్ఓ వాసు బాబు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ లు శేషగిరిరావు, అనిల్ కుమార్, రహంతు జానీ, డిఈఈ ముజాహిద్దీన్, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు హాజరయ్యారు.

# పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు షేక్ సత్తార్ ఆధ్వర్యంలో పాఠశాల సీనియర్ హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ మన్సూర్ తన సొంత నిధులతో సమకూర్చిన 10వ తరగతి హిందీ స్టడీ మెటీరియల్ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పబ్లిక్ పరీక్షల్లో అన్సర్ రాసే విధానాన్ని ప్రాక్టీస్ చేయడానికి, హిందీ భాషపై విద్యార్థులు పట్టు సాధించేందుకు ఉపయుక్తంగా ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.